## గురుకులంలో గణతంత్ర శిల్పం




కోట, జనవరి 25 : కోటలోని అంబేడ్కర్ గురుకులంలో గురువారం సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులచేత 75వ గణతంత్ర దినోత్సవ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు.స్వాతంత్ర్యపోరాటంలో ప్రముఖపాత్ర పోషించిన గాంధీ, నేతాజీ , నెహ్రూ చిత్రాలను ఇసుకతో మలిచారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన పెంపొందించే విధంగా ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. గురుకులం ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు సైకత శిల్పి సనత్‌కుమార్‌ను అభినందించారు.

→ సైకతా శిల్పం వద్ద విద్యార్థులు

## రిపబ్లిక్ డే ఏర్పాట్లు పూర్తి

● 300మందికి పైగా ఉద్యోగులకు నేడు పురస్కారాలు



→ మువ్వన్నెల విద్యుత్ కాంతుల్లో కలెక్టరేట్ ముస్తాబు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 25:గణతంత్ర దినోత్సవానికి తిరుపతిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ అందంగా ముస్తాబైంది.వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి 12స్టాళ్లను ఏర్పాటు చేశారు.గురువారం పోలీసు కవాతు రిహార్సల్స్‌ను ఎస్పీ పరమేశ్వరరెడ్డి నేతృత్వంలో నిర్వహించారు.జాతీయ పతాకం ఎగురవేసి జెండా వందనం స్వీకరించారు.డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనల రిహార్సల్స్ కూడా జరిగాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మువ్వన్నెల రంగుల విద్యుత్ కాంతులతో కలెక్టరేట్ భవనం ముస్తాబైంది.శుక్రవారం ఉదయం 9.10గంటలకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి జాతీయ పతాకం ఎగురవేశాక జిల్లా అభివృద్ధి గురించి మాట్లాడతారు. 7 ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన,బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 300మంది ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాల పంపిణీ చేయనున్నారు.

# అడ్రసు....ఆంధ్రప్రదేశ్

● చంద్రగిరి ఓటర్ల జాబితాలో వింతలు ● కొనసాగుతున్న డబుల్ ఎంట్రీలు ● తుది జాబితాలోనూ తొలగించని తప్పులు

**తహసిల్దారు నుంచీ కలెక్టర్ సహా రాష్ట్ర, కేంద్ర ఎన్నికల అధికారులకు భారీఎత్తున ఫిర్యాదులు... టీడీపీ నాయకుల ఆత్మాహుతి యత్నాలు... ఎన్నికల కమిషన్ హెచ్చరికలు... బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు.... ఇంత కసరత్తు జరిగినా తాజాగా విడుదలైన చంద్రగిరి నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాలో అవే తప్పులు పునరావృతమయ్యాయి.ఎక్కడా దిద్దుబాట్లు కనిపించక పోగా గత అక్టోబరు నుంచీ ఇటీవలి దాకా చేపట్టిన మార్పుచేర్పుల్లోనూ మరిన్ని తప్పిదాలు చోటు చేసుకున్నాయి. పలువురు ఓటర్లకు జారీ అయిన ఎపిక్ కార్డుల్లో వారి అడ్రసులే లేవు. డోర్ నంబరు అన్న కాలమ్ ఎదురుగా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొని వుంది. ఇక డబుల్ ఎంట్రీల సంగతి సరేసరి. ప్రింటింగ్‌లో పొరబాట్లో లేక ఎంట్రీలో పొరబాట్లో గానీ జాబితా గందరగోళంగా మారింది.**


**- తిరుపతి, ఆంధ్రజ్యోతి**



చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి అనేక మంది ఓటర్లకు ఎపిక్ కార్డుల్లో వారి చిరునామాలు గల్లంతయ్యాయి. చిరునామా అన్న చోట (ఇంటి నంబరు కాలమ్) అంధ్రప్రదేశ్ అని ముద్రించి వుంది. తిరుపతి రూరల్ మండలం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ పోలింగ్ స్టేషన్ నంబరు 349 పరిధిలో ఎక్కువగా ఈ పరిస్థితి కనిపించింది. ఉదాహరణకు ఈ ప్రాంతంలో ప్రకాష్‌రెడ్డి భార్య విజయలక్ష్మి (26)కి ఐఏఎక్స్ 3373776 నంబరుతో జారీ అయిన ఎపిక్ కార్డులో (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1010) ఇంటి నంబరు అన్న చోట అంధ్రప్రదేశ్ అని ముద్రించి వుంది. సుబ్రమణ్యం కుమారుడు శ్రీనివాసులు (41)కు చెందిన ఐఏఎక్స్ 3374907 నంబరుగల ఎపిక్ కార్డు (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1013)లోనూ ఇంటి నంబరు కాలమ్ ఎదుట అంధ్రప్రదేశ్ అని ముద్రించారు. ఐఏఎక్స్ 3374915 నంబరుతో (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1014) త్యాగరాజు భార్య రజని (44) పొందిన ఎపిక్ కార్డులోనూ ఇంటి నంబరు వుండాల్సిన చోట రాష్ట్రం పేరు ముద్రించారు. కొత్తగా నమోదు చేసుకున్న యువత విషయంలోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. ఉదాహరణకు షేక్ రఫీ కుమార్తె నసీమా (18)కు జారీ అయిన ఐఏఎక్స్ 3374931 నంబరు ఎపిక్ కార్డు (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1016)లోనూ ఇంటి నంబరు వద్ద అంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. దావీదు కుమార్తె హెప్సీబా (18) పేరిట వచ్చిన ఐఏఎక్స్ 3369824 నంబరు ఎపిక్ కార్డు (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1008)లోనూ అలానే పేర్కొన్నారు. మూడే సుబ్బరామ్ నాయక్ కుమార్తె శోభారాణి (25)కి ఐఏఎక్స్ 3374923 నంబరుతో (ఓటరు సీరియల్ నంబరు 1015) జారీ అయిన ఎపిక్ కార్డులో కూడా డోర్ నంబరు కాలమ్ ఎదుట అంధ్రప్రదేశ్ అని వుంది. ఇవన్నీ గతేడాది అక్టోబరు 27వ తేదీకి ఈ నెల 22వ తేదీకి నడుమ నమోదైన మార్పుచేర్పులు కావడం గమనార్హం.

### భారీగా డబుల్ ఎంట్రీలు

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు భారీగా కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి తిరుపతి రూరల్ మండలంలోనే డబుల్ ఎంట్రీలు అధికంగా నమోదయ్యాయి. ఒకే ఎపిక్ కార్డుతో అటు చంద్రగిరి నియోజకవర్గంలో ఇటు తిరుపతి నియోజకవర్గంలో రెండు చోట్లా ఓటరుగా నమోదైన వ్యక్తులు పలువురు కనిపిస్తున్నారు. ఉదాహరణకు తిరుపతి రూరల్ మండలం సప్తగిరి కాలనీకి చెందిన ముక్కంటి బాలకృష్ణ భార్య ముక్కంటి పావని (38)కి పోలింగ్ కేంద్రం 349లో ఓటరు సీరియల్ నంబరు 1071, ఏవైఎం 1241793 నంబరుతో ఎపిక్ కార్డు వుంది. ఈమె పేరు గతేడాది డిసెంబరు 24న అప్‌డేట్ చేసినట్టు జాబితాలో పేర్కొన్నారు. అయితే పావని అదే ఎపిక్ కార్డు నంబరుతో తిరుపతి నియోజవకర్గం పోలింగ్ కేంద్రం నంబరు 211 (సత్యనారాయణపురం)లో సీరియల్ నంబరు 490తో ఓటరుగా నమోదై వున్నారు. ఈ వివరాలు గతేడాది డిసెంబరు 9న అప్‌డేట్ అయ్యాయి. కొత్త ఓటరు జాబితాలో రెండు చోట్లా పావని ఓటరుగా కొనసాగుతున్నారు. చంద్రగిరి సెగ్మెంట్ సప్తగిరి కాలనీలో పోలింగ్ కేంద్రం 349కే చెందిన సుబ్రమణ్యం కుమారుడు పి.నాగరాజు (62) ఏవైఎం 1351014 నంబరు ఎపిక్ కార్డు, సీరియల్ నంబరు 1081లతో ఈనెల 13న ఓటరుగా నమోదయ్యారు. ఆయన అదే ఎపిక్ నంబరుతో తిరుపతి నియోజకవర్గం పోలింగ్ కేంద్రం నంబరు 182 (కొత్తపల్లి)లో కూడా సీరియల్ నంబరు 743తో ఓటరుగా నమోదై వున్నారు. గతేడాది డిసెంబరు 9న ఓటరుగా ఈయన వివరాలను జాబితాలో అప్‌డేట్ చేశారు. చంద్రగిరి సెగ్మెంట్ పోలింగ్ కేంద్రం 349లోనే బి.సుబ్బారెడ్డి భార్య శ్యామల (30) ఏవైఎం2012458 ఎపిక్ కార్డు నంబరు, ఓటరు సీరియల్ నంబరు 1072లతో ఓటరుగా వున్నారు. ఈ ఎపిక్ కార్డు నంబరుతోనే మళ్ళీ తిరుపతి నియోజకవర్గం పోలింగ్ కేంద్రం నంబరు 105లో కూడా సీరియల్ నంబరు 308తో రైల్వే కాలనీలో ఓటరుగా నమోదై వున్నారు. గత డిసెంబరు 9న ఈ వివరాలు జాబితాలో అప్‌డేట్ అయ్యాయి. చంద్రగిరి సెగ్మెంట్ పోలింగ్ కేంద్రం 349 పరిధిలోనే కొండయ్య కుమారుడు బోదనపు నరేష్ (33) ఏవైఎం 3335817 ఎపిక్ కార్డు నంబరు, సీరియల్ నంబరు 1000లతో ఓటరుగా వున్నారు. గత డిసెంబరు 9న జాబితాలో వివరాలు అప్‌డేట్ అయ్యాయి. అయితే ఇదే ఎపిక్ నంబరుతో తిరుపతి నియోజవకర్గం 267వ నంబరు పోలింగ్ కేంద్రం (ఎల్ఎస్ నగర్) లో కూడా సీరియల్ నంబరు 2తో ఓటరుగా నమోదై వున్నారు. గతేడాది డిసెంబరు 9న వివరాలు అప్‌డేట్ అయ్యాయి.



పావనికి రెండుచోట్ల ఓటు

### తప్పుల తడకగా ఓటర్ల జాబితా

చంద్రగిరి సెగ్మెంట్ పరిధిలో ఓటర్ల జాబితా తప్పుల తడకగా కనిపిస్తోంది. ఎపిక్ కార్డు ఐఏఎక్స్ 3374899 నంబరు, (సీరియల్ నంబరు 1012)తో రజాక్ సాహెబ్ కుమార్తె మెహరీన్ (24) పేరు ఓటర్ల జాబితాలో నమోదైంది. అయితే జాబితాలో మెహరీన్ అన్న పేరును పరిశీలిస్తే పేరులో సగం అంటే మెహ అన్నది తెలుగులో వుండగా మిగిలిన రీన్ అన్న అక్షరాలు హిందీలో ముద్రించారు. ఇక తండ్రి రజాక్ పేరు తెలుగులో వుండగా ఇన్షియల్ మాత్రం హిందీలో ముద్రించారు. యధాప్రకారం డోర్ నంబరు అన్న కాలమ్ ఎదుట అంధ్రప్రదేశ్ అని వుంది.



### ఒకే పోలింగ్ కేంద్రంలో మహిళకు రెండు ఓట్లు

తిరుపతి రూరల్ మండలం సప్తగిరి కాలనీ పోలింగ్ కేంద్రం 349 పరిధిలో 12-174 ఇంటి నంబరులో వున్న జి.శేఖర్ భార్య జి.ప్రతిమ (47)కు ఓటరు జాబితా సీరియల్ నంబరు 513, ఏవైఎం 0560490 నంబరుతో ఎపిక్ కార్డు జారీ అయింది. అయితే అదే ఎపిక్ కార్డు నంబరు, అదే అడ్రసుతో, అదే పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితా సీరియల్ నంబరు 999తో మరో ఎపిక్ కార్డు కూడా జారీ అయింది. అంటే ఒకే ఎపిక్ కార్డు నంబరుతో ఆమె ఓటరు జాబితాలో రెండు చోట్ల నమోదయ్యారు. అది కూడా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఇలా జరగడం చాలా విడ్డూరంగా కనిపిస్తోంది.



### ఒకే ఇల్లు.... ఎన్ని తప్పులో



సప్తగిరి కాలనీలో 12-78 నంబరు గల ఇంటిలో జి.శ్రీనివాసులు, రుక్మిణి దంపతులు నివాసముంటున్నారు. అది వారి సొంతిల్లు. శ్రీనివాసులు ఎంజెడ్‌టీ3570843 ఎపిక్ కార్డు నంబరుతో 335 పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబరు 1057తో ఓటరుగా వున్నారు. ఆయన భార్య రుక్మిణి ఎంజెడ్‌టీ3570819 ఎపిక్ కార్డుతో 335వ నంబరు పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితా సీరియల్ నంబరు 1056తో ఓటరుగా వున్నారు. వీరి డోర్ నంబరు 12-78 పాతది కాగా ఇపుడు కొత్తగా 8-71 కేటాయించారు. వీరిద్దరి ఎపిక్ కార్డుల్లో పాత నంబరూ, కొత్త నంబరూ రెండు కాకుండా 8-74 అని ముద్రించి వుంది. ఇదో గందరగోళమైతే వీరి పాత డోర్ నంబరుతో మరో ఇద్దరి పేర్లు ఓటర్ల జాబితాలో నమోదయ్యాయి. ఏమా సీతారామిరెడ్డి కుమారుడు కుమార్‌రెడ్డి (36) ఎపిక్ కార్డు నంబరు ఐఏఎక్స్ 3399193, ఓటరు సీరియల్ నంబరు 1054తో ఓటరుగా వున్నారు. అలాగే కుమార్‌రెడ్డి భార్య ఏమా నాగమణి (32) సీరియల్ నంబరు 1053,ఎపిక్ నంబరు ఐఏఎక్స్3399185లతో ఓటరుగా నమోదయ్యారు. ఆ డోర్ నంబరులో యజమానులైన శ్రీనివాసులు, రుక్మిణి నివాసముంటున్నారు. ఆరా తీసేందుకు కుమార్‌రెడ్డికి ఫోన్ చేయగా స్పష్టంగా సమాధానమివ్వకుండా పెట్టేశారు.ఇలా చెప్పుకుంటూ పోతే చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో కనిపిస్తున్న తప్పిదాలు, వింతలూ, విడ్డూరాలకు అంతూపొంతూ లేదనే చెప్పాలి. అయితే అవి పొరపాటున జరిగినవా లేక ఉద్దేశపూర్వకంగా చేసినవా అన్నదే కీలకం కానుంది. ఇదివరకే ఎన్నికల కమిషన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఇపుడు మళ్ళీ ఆధారాలతో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే బాధ్యులైన ఉద్యోగులు, అధికారులపై తీవ్ర చర్యలు తీసుకునే అవకాశముంది.



బలిజపల్లె నుంచి హరిజనవాడకు వెళ్లిన ఓటర్లు

## తప్పుల తడకగా ఓటర్ల జాబితా

భాకరాపేట, జనవరి 25 : తుది ఓటర్ల జాబితాలోనూ ముసాయిదా ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పులను సవరించకుండా అలాగే వుంచేశారు. మృతులు, డబుల్ ఎంట్రీలు, వలస వెళ్లిపోయిన వారి ఓట్లు తాజా జాబితాలో అలాగే ఉన్నాయి. చిన్నగొట్టిగల్లు మండలంలోని పోలింగ్ కేంద్రం 42లో భాకరాపేట బీసీ కాలనీ, బలిజపల్లె, నీరుగట్టు హరిజనవాడ, నారాయణ స్వామి కాలనీలు ఉన్నాయి. తాజా ఓటరు జాబితాలో సీరియల్ నెంబరు 388 నుంచి 417 వరకు ఉన్న ఓట్లు బలిజపల్లెకు చెందినవి.వీరందరివి నీరుగట్టు హరిజనవాడ సెక్షన్లో చేరిపోయాయి.అలాగే సీరియల్ నెంబరు 974 నుంచి 982 వరకు ఉన్న ఓటర్లు నారాయణస్వామి కాలనీకి చెందిన వారు. వీరి పేర్లు బీసీ కాలనీ జాబితాలోకి వెళ్లిపోయాయి.



నారాయణస్వామి కాలనీ నుంచి బీసీ కాలనీకి వెళ్లిన ఓటర్ల జాబితా

# ఎంపీ గురుమూర్తికి ఆదిలోనే అసమ్మతి సెగ

● వైసీపీ మండల కన్వీనర్ రాకతో సమావేశాన్ని బహిష్కరించిన ఒక వర్గం ● పార్టీ సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ/ తిరుపతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సత్యవేడు వైసీపీ ఇంచార్జిగా నియోజకవర్గంలో అడుగుపెట్టారో లేదో అసమ్మతి సెగ తాకింది. ఇటీవల సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిగా గురుమూర్తిని వైసీపీ అధిష్టానం నియమించిన సంగతి తెలిసిందే.రానున్న ఎన్నికల్లో సత్యవేడు నుంచీ పోటీ చేయనున్న నేపథ్యంలో పర్యటనలకు ఎంపీ గురుమూర్తి శ్రీకారం చుట్టారు. సత్యవేడు సెగ్మెంట్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన శ్రేణులనూ ఈనెల 27న తిరుపతికి ఆహ్వానించి మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు.మంత్రి ద్వారా తనకు సహకరించి గెలుపుకోసం పనిచేయాలంటూ శ్రేణులకు దిశా నిర్దేశం చేయించేలా కార్యక్రమం రూపొందించుకున్నారు. అందులో భాగంగా మండలాల వారీగా ఆహ్వానించే పనిలో భాగంగా గురువారం బీఎన్ కండ్రిగకు వెళ్ళారు. అక్కడ సమావేశానికి మండల కన్వీనర్ విద్యానాథరెడ్డి హాజరు కాలేదు. ఎమ్మెల్యే ఆదిమూలం అనుచరుడైన ఆయన రాకపోవడంతో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం చొరవ తీసుకుని ఎంపీకి భారీసంఖ్యలో స్వాగతం పలికారు. అయితే సమావేశం ప్రారంభమయ్యే సమయంలో మండల కన్వీనర్‌ను కూడా ఆహ్వానిస్తే బాగుంటుందని కొందరు సూచించడంతో ఎంపీ కన్వీనర్ ఇంటికి వెళ్ళి వెంట బెట్టుకుని తిరిగివచ్చారు. దీంతో అప్పటి వరకూ ఎంపీని నెత్తిన పెట్టుకున్న ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు ఒక్కసారిగా రివర్స్ య్యారు. కన్వీనర్ సమావేశానికి రాకపోగా తామంతా ముందుండి స్వాగత సత్కారాలు చేస్తే సమావేశానికి రాని కన్వీనర్ ఇంటికి ఎంపీ వెళ్ళి పిల్చుకురావడమేమిటని మండిపడ్డారు.సింగిల్‌విండో ఛైర్మన్ హరినాథరెడ్డి, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురునాథం, గురవయ్యలతో పాటుగా పదుల సంఖ్యలో నాయకులు, వారి అనుచరులు అక్కడినుంచి వెళ్ళిపోయారు. ఎంపీ అనుచరులు వచ్చి ఎంత సముదాయించినా సమావేశానికి రాకపోవడంతో అరగంట తరువాత కన్వీనర్‌తో కలసి వున్న కొద్దిమందితోనే ఎంపీ సమావేశం నిర్వహించి తిరుపతి మీటింగుకు రావాలని అభ్యర్థించి వెళ్ళిపోయారు.ఎంపీపీ సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునికృష్ణా రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ బాలాజీరెడ్డి, వైసీపీ జిల్లా కార్మిక విభాగ అధ్యక్షుడు బీరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



అసమ్మతి నాయకులను సముదాయిస్తున్న ఎంపీ అనుచరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

**మండల పరిషత్ మీటింగ్ హాల్లో సమావేశమా?**

ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రమే వేదిక కావాల్సిన బీఎన్ కండ్రిగ మండల పరిషత్ కార్యాలయ మీటింగు హాలు గురువారం వైసీపీ కార్యకర్తల సమావేశానికి వేదికగా మారింది.ఎంపీ గురుమూర్తి అక్కడ పార్టీ అభివృద్ధి, ఐక్యత గురించి ప్రసంగించారు. ప్రభుత్వ కార్యాలయంలో అధికార పార్టీ సమావేశం ఏర్పాటు చేయడం, ఎంపీడీవో సాయి లహరి కూడా ఈ సమావేశంలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

## రోడ్డుప్రమాదంలో అత్తాకోడళ్ల మృతి



మృతులు లీలారాణి, విజయఅను (ఫైల్ ఫొటోలు)

పిచ్చాటూరు, జనవరి 25 : రోడ్డు ప్రమాదంలో అత్తాకోడళ్లు మృతి చెందడం బాధిత కుటుంబంతో పాటు పిచ్చాటూరువాసులను విషాదానికిలోనుచేసింది. పిచ్చాటూరుకు చెందిన బుక్‌స్టోర్ యజమాని ఉమాశంకర్ గుప్త అలియాస్ శంకర్‌శెట్టి భార్య ఎ.లీలారాణి,చిన్న కుమారుడు వినోద్, కోడలు విజయ అను,మనవళ్ళతో కలసి గురువారం ఉదయం కంచి మీనాక్షి గుడికి వెళ్లారు.దర్శనానంతరం అక్కడినుంచి బెంగళూరుకు కారులో బయల్దేరారు. మార్గమధ్యంలోని రాయవేలూరుకు 10 కి.మీ ముందు కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది.ఈ ప్రమాదంలో లీలారాణి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ మిగిలిన వారిని చికిత్స నిమిత్తం వేలూరు నరువ్య ఆస్పత్రికి తరలించారు. విజయఅను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.శంకర్‌శెట్టి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుండగా వినోద్‌కు చేయి విరిగినట్లు సమాచారం. పిల్లలు ఇద్దరూ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పిచ్చాటూరులో సుమారు 40 ఏళ్లుగా బుక్‌స్టోర్ నడుపుతూ స్థానికంగా అందరికీ చిరపరిచితుడైన శంకర్‌శెట్టి కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల స్థానిక వ్యాపార సంఘం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

## కుంభమేళాలో సిద్ధమైన కొత్త రాజ్యాంగం

### పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 25 : ఇస్లామిక్ దేశాల తరహాలో మన దేశంలోనూ మత విలువల ఆధారంగా ప్రత్యామ్నాయ రాజ్యాంగం రాబోతోందని పౌర హక్కుల నేత ప్రొఫెసర్ జి. హరగోపాల్ పేర్కొన్నారు. రాజ్యాంగం - నైతికత అనే అంశంపై తిరుపతి పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో గురువారం సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ.. అలహాబాద్‌లో నిర్వహించిన కుంభమేళాలో మన దేశానికి కొత్త రాజ్యాంగం తయారు చేశారన్నారు. 2024 ఎన్నికల తరువాత దానికి మద్దతు లభిస్తే, కొత్త రాజ్యాంగం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. 1949లో నిర్వహించిన రాజ్యాంగ సభలోనే ఈ రాజ్యాంగం మనది కాదనీ, ఇది చీలికలు పేలికల రాజ్యాంగమనీ, పాశ్చాత్య విలువలు కలదని, మన సంస్కృతికి సంబంధించినది కాదనీ కొందరు విమర్శలు చేశారని గుర్తు చేశారు. ఆనాడు అలా విమర్శించిన భావజాలానికి సంబంధించిన వారే, ఇటీవల కుంభమేళాలో సర్వసంగ పరిత్యాగులైన సాధువులు తయారు చేసిన రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇస్లాంలో కానీ, క్రైస్తవంలో కానీ ఒకే దేవుడు, ఒకే తాత్విక చింతన కనుక, ఇస్లామిక్ దేశాల్లో మత విలువల ప్రాతిపదికన రాజ్యాంగం అమలవుతూ ఉందన్నారు. హిందూ మతంలో ఆరు తాత్విక చింతనలు ఉన్నాయన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో దేవుడున్నాడనీ, ఏ తాత్వికతను ఆధారం చేసుకొని మత రాజ్యాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమవుతుందని ప్రశ్నించారు. హిందూ మతం నుంచీ కొన్ని విలువలతో రాజ్యాంగాన్ని తయారు చేయాలని కొందరు ప్రయత్నం చేస్తే, ఆనాడే అంబేడ్కర్ వాటి మూలాల్లోకి వెళ్లి ప్రశ్నించారని తెలిపారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వారు, సమానత్వాన్ని అంగీకరించరని, సమానత్వం అంటే ఎదగడానికి ప్రతి మనిషికీ సమాన అవకాశాలు కల్పించడమేనన్నారు. మహిళల హక్కులను ఏ ఒక్క మతం అంగీకరించదనీ, ఈ రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు ముందుకు రావడంతో పరిమితమైన హక్కులున్నప్పటికీ ప్రస్తుత రాజ్యాంగాన్ని సమర్థించాల్సి వస్తోందన్నారు. ఈ రాజ్యాంగంలో పేర్కొన్నటువంటి సమాజం కంటే ఉన్నతమైన సమాజాన్ని నిర్మించుకోవలసిన సమయంలో, ఉన్న రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమానవీయంగా మారిన మానవ సంబంధాలను పునరుద్ధరించవలసిన అవసరం ఉందన్నారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో నేటి సమాజానికి అవసరమైన నైతికత ఉందన్నారు. మనకు సమానమైన న్యాయం జరిగేలా రాజ్యాంగ పీఠిక రాశారని చెప్పారు. భారతీయుడు ఎలా ఉండాలో చూపిన రాజ్యాంగంలో పౌరుడి హక్కులే కాకుండా బాధ్యతలను కూడా పేర్కొన్నట్టు తెలిపారు. మానవ విలువలు కాలానుగుణంగా మారుతుంటాయనీ, ప్రాంతంతో పాటు కాలం కూడా వాటిని నిర్దేశిస్తుందన్నారు.పౌర చైతన్య వేదిక గౌరవాధ్యక్షుడు రాఘవశర్మ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో అధ్యక్ష కార్యదర్శులు వాకా ప్రసాద్, కుమార్‌రెడ్డి, కోశాధికారి హరీష్, సాకం నాగరాజ, భూమన్, తమటం రామ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సన్మానం

తిరుపతి (రవాణా), జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో గురువారం ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వయోవృద్ధులను బీఎల్వోలు సన్మానించారు. వైసీపీ పంచాయతీ ఇన్‌చార్జి శివశంకర్‌రాజు, అధ్యక్షుడు మొదలియార్ రమేష్, ఎంపీటీసీ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

## కమీషన్ల కోసమే శ్రీపాదం, అచ్యుతం నిర్మాణం : టీడీపీ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 25: తిరుపతిలో అభివృద్ధి పేరుతో టీటీడీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, శ్రీవారి భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉన్న రెండవ, మూడవ సత్రాలను కూల్చి కమీషన్ల కోసమే శ్రీపాదం, అచ్యుతం భవనాలను నిర్మించతలపెట్టారని టీడీపీ పట్టణాధ్యక్షుడు చిన్నబాబు ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ సత్రాలను నిర్మించి 60 సంవత్సరాలు మాత్రమే గడిచిందని తెలిపారు. 133 సంవత్సరాల క్రితం నిర్మించిన తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయ భవనం ఇప్పటికీ నాణ్యంగా ఉందని పేర్కొన్నారు. సత్రాల భవనాలు ప్రమాదకరంగా ఉన్నాయని ఏ టీటీడీ ఇంజనీర్ సూచించారో ప్రజలకు చెప్పాలని కోరారు. టీటీడీ వార్షిక బడ్జెట్‌లో ఇంజనీరింగ్ శాఖకు రూ.350 కోట్లు కేటాయించారని, శ్రీపాదం, అచ్యుతం నిర్మాణానికి రూ.418కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారని, మిగిలిన నగదు గుత్తేదారుకు ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. కుమారుడి ఎన్నికల ఖర్చుకోసం నిధుల సేకరణలో భాగంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇలాంటి ప్రతిపాదనలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించిన వివరాలు అడిగితే ఈవో ధర్మారెడ్డి సరిగా సమాధానం చెప్పడం లేదన్నారు. సత్రాల నిర్మాణ టెండరు ఖరారు నోటీసులు టీటీడీ వెబ్‌సైట్‌లో ఉంచకుండా, పత్రికా ప్రకటన చేయకుండా పక్క రాష్ట్రాల్లో పత్రికా ప్రకటనలు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో ఈవో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే కమీషన్ల బాగోతం బహిర్గతం చేస్తామన్నారు.



# అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

● కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి (రవాణా), జనవరి 25: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. కచ్చపి కళాక్షేత్రంలో నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, ఆర్డీవోలు, ఈఆర్వోలతో కలిసి నిర్వహించిన 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1950వ సంవత్సరంలో ఎన్నికల సంఘం ఏర్పడిందని, 2011 నుంచి జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. 18 ఏళ్లు పైబడిన వారందరూ ఓటు హక్కు పొంది, వినియోగించుకోవాలన్నారు. కులం, మతం, డబ్బు చూడకుండా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు ద్వారా మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం డీఆర్వోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు, బీఎల్‌వోలకు ప్రశంసాపత్రాలు, 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదు అయిన యువతకు గుర్తింపు కార్డులను కలెక్టర్, కమిషనర్ పంపిణీ చేశారు. అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఆర్డీవో, తహసీల్దార్లతో కలిసి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ ఓటరుగా నమోదు చేసుకోకుంటే వెంటనే చేసుకోవాలన్నారు. ఇప్పటికే చేసుకుని ఉంటే జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవాలని, లేనిపక్షంలో ఫారం 6 ద్వారా నమోదు చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ జీఎం వీఆర్ చంద్రమౌళి, ఆర్డీవోలు, ఈఆర్వోలు నిశాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, రవిశంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, అర్బన్ తహసీల్దారు వెంకటరమణ, ఏఈఆర్వోల రమేష్‌బాబు, ప్రమీల, సుబ్రహ్మణ్యం, మునిశైలజ, భూపతి, సుబ్రహ్మణ్యం, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


నూతన ఓటర్లకు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి


సీనియర్ సిటిజన్‌లను సన్మానిస్తున్న కలెక్టర్

## వేడుకగా రామకృష్ణ తీర్థ ముక్కోటి







తిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శేషాచల అడవుల్లోని రామకృష్ణ తీర్థ ముక్కోటిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా పుష్య మాసం పౌర్ణమినాడు రామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. రామకృష్ణ మహర్షి తపోబలంతో ఈ పుణ్యతీర్థాన్ని సృష్టించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. శ్రీవారి ఆలయం నుంచి అర్చక సిబ్బంది మంత్రోచ్ఛారణ చేసుకుంటూ ఊరేగింపుగా ఉదయం 10 గంటలకు తీర్థానికి చేరుకున్నారు. అక్కడ కొలువై ఉన్న రామచంద్రమూర్తి, కృష్ణభగవానుల విగ్రహాలకు పాలు, పెరుగు, చందనం తదితర సుంగధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. భక్తులకు పాపవినాశనం డ్యాం వద్ద అన్నప్రసాదాలు అందజేశారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.

## వైభవంగా పుష్యమాస పౌర్ణమి గరుడసేవ



తిరుమలలో గురువారం రాత్రి పుష్య మాస పౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి గరుడుడిపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణం, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ నాలుగు మాడవీధుల్లో విహరించిన శ్రీవారిని భక్తులు దర్శించి ఆనందపరవశులయ్యారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## బర్డ్ ట్రస్టుకు రూ.11 లక్షల విరాళం

తిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని బర్డ్ ట్రస్టుకు గురువారం రూ.11 లక్షల విరాళం అందింది. ఢిల్లీకి చెందిన రమా సివిల్ ఇండియా కన్‌స్ట్రక్షన్స్ సంస్థ తరపున తిరుపతికి చెందిన రాఘవేంద్ర ఈ విరాళాన్ని తిరుపతిలో టీటీడీ జేఈవో సదాభార్గవికి అందజేశారు.

## ప్రజల చెంతకే పాలన : తుడా చైర్మన్


ఆసరా చెక్కును అందజేస్తున్న మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం, జనవరి 25: ప్రజల చెంతకే పాలన అందించేందుకు ప్రభుత్వం గంగిరెడ్డిపల్లెల్లో సచివాలయ భవన సముదాయాలను రూ.కోటి వ్యయంతో నిర్మించిందని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద 849 మహిళా పొదుపు సంఘాలకు రూ.3.65కోట్లు ఆసరా చెక్కును అందజేశారు. తోకగుట్ట వద్ద సచివాలయ భవనం, హెల్త్‌క్లీనిక్, అంగన్‌వాడీ భవనం, మహిళా శక్తి భవనం, మినరల్ వాటర్ ప్లాంట్ భవనాన్ని మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే రావిళ్లవారిపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీ బాబు, భానుకుమార్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా నిధుల అందజేత

తిరుచానూరు, జనవరి 25: తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి వైఎస్ఆర్ ఆసరా 4వ విడత నిధుల చెక్కును అందజేశారు. తిరుపతి రూరల్ మండలంలో 4వ విడత వైఎస్ఆర్ ఆసరా రూ.24.09కోట్లను మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు.

## శ్రీధర్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు


శ్రీధర్‌రెడ్డికి సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి సత్కారం

తిరుచానూరు, జనవరి 25: తిరుచానూరు గంగమ్మగుడి చైర్మన్ శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కార్యాలయంలో పలువురు ఆయన్ను సన్మానించారు. కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముండ్లపూడి సర్పంచ్ సూరి, ఎంపీటీసీలు నరేష్‌రెడ్డి, యోగానందరెడ్డి, శేఖర్‌రెడ్డి, వార్డు మెంబరు మునీంద్ర రాయల్, ఆర్ఆర్ యూత్ మల్లి, శీను, దుర్వాసులరెడ్డి, బాలకృష్ణ, హరి, చంద్రశేఖర్, మోహన్, చెంగా తదితరులు పాల్గొన్నారు.

## ఓటును అమ్ముకుంటే ప్రశ్నించే హక్కును కోల్పోయిననట్లే

తిరుపతి రూరల్, జనవరి 25: ఓటును అమ్ముకుంటే ప్రశ్నించే హక్కును ప్రజలు కోల్పోతారని మహర్షి అభ్యుదయ సేవా సంస్థ (మాస్) అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీపురంలో గురువారం నిర్వహించిన ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పాకాల, జనవరి 25: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ ఎం.పురుషోత్తం నాయుడు కోరారు. స్థానిక ప్రైవేటు కళాశాలలో ఈ పథకం ద్వారా శిక్షణ పొందిన వారికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటాద్రినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్ర బాబు, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు గౌతమి, చంద్రగిరి బీజేపీ అధ్యక్షుడు రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై 29 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(ఆటోనగర్) జనవరి25 : 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఎస్పీడీసీఎల్ సమర్పించిన ఆర్థిక ఆవశ్యకత, విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఈనెల 29 నుంచి 31 వరకు ఏపీ విద్యుత్ నియంత్రణామండలి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఎండీ కె.సంతోషరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ కార్యాలయం నుంచి మూడు రోజుల పాటు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమ అభ్యంతరాలను లైవ్ స్ట్రీమింగ్ లింక్ ద్వారా తెలియజేయాలని కోరారు. తిరుపతి సర్కిల్ కార్యాలయం నుంచి లేదా డివిజన్ కార్యాలయాలలో పాల్గొని తమ అభ్యంతరాలను చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డికి వివరించవచ్చని తెలిపారు.

## అండర్ పాస్ నిర్మించండి


అండర్ పాస్ కోసం ధర్నా చేస్తున్న గ్రామస్తులు

భాకరాపేట, జనవరి 25: జాతీయ రహదారి మార్గంలో చిన్నగొట్టిగల్లు వద్ద అండర్ పాస్ నిర్మించాలని జంగావాండ్లపల్లె, తిప్పిరెడ్డిగారిపల్లె గ్రామస్తులు గురువారం ధర్నా నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తిప్పిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె పంచాయతీల నుంచి చిన్నగొట్టిగల్లు రావడానికి ఆర్ అండ్ బీ రోడ్డు ఉందన్నారు. ఈ మార్గంలో చిన్నగొట్టిగల్లు సమీపంలో 65+400 పాయింట్ వద్ద జాతీయ రహదారి దాటి చిన్నగొట్టిగల్లులోకి వెళ్లాల్సి ఉంటుందన్నారు. అండర్ పాస్ గానీ, సిగ్నల్ గానీ, ఫ్లై ఓవర్‌గానీ, డివైడర్‌గానీ లేకుండా రోడ్డు నిర్మిస్తున్నారని తెలియజేశారు. దీనివల్ల తాము ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 65+400 పాయింట్ వద్ద అండర్ పాస్ నిర్మించాలని కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు లోకేశ్వరి గ్రామస్తులతో చర్చించారు. సమస్య పరిష్కరించడానికి ఉన్నతాధికారులతో చర్చిస్తామని వివరించారు.

## 31న టీడీపీ సమీకృత శిక్షణ

తిరుపతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితా పరిశీలన, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలపై ఈనెల 31న తిరుపతిలోని ప్రతి క్లస్టర్‌లో సమీకృత శిక్షణ (ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్) కార్యక్రమం జరగనుందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. గురువారం ఆమె నివాసంలో క్లస్టర్ ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి బాధ్యత తీసుకోవాలని, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులతో పాటు ప్రతి బూత్‌కు ఒక మహిళ పాల్గొనేలా చూడాలని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ ముసుగులో మరోసారి విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్, శ్రీధర్ వర్మ, బుల్లెట్ రమణ, చినబాబు, కృష్ణయాదవ్, రఘు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోండి

చంద్రగిరి, జనవరి 25: ఓటు హక్కుతో సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోవాలని తహసీల్దార్ శిరీష అన్నారు. గురువారం చంద్రగిరిలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థినులు డబ్బు విలువ, ఓటు విలువ తెలుసుకో అంటూ, నినాదాలు చేస్తూ ర్యాలీగా టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నారు. అనంతరర మానవహారం చేపట్టారు. ఓటు హక్కుపై నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హిమబిందు, డీటీ అమృత, ఆర్ఐ సులోచన, సీనియర్ అసిస్టెంట్ వినోద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

చంద్రగిరి, జనవరి 25: చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగాయి. వ్యాయామ ఉపాధ్యాయులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. పురుషుల కబడ్డీలో దామలచెరువు సచివాలయం-1 విన్నర్స్‌గా, మల్లంగుంట సచివాలయం రన్నర్స్‌గా, కాశిపల్లి సచివాలయం క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచారు. పురుషుల వాలీబాల్ పోటీలలో నరసింగాపురం సచివాలయం విన్నర్స్‌గా, భాకరాపేట సచివాలయం రన్నర్స్‌గా, తృతీయ స్థానంలో పెరుమాళ్లపల్లె సచివాలయం క్రీడాకారులు నిలిచారు. పురుషుల ఖోఖో పోటీలలో మంగళం సచివాలయం విన్నర్స్‌గా, చిన్నగొట్టిగల్లు రన్నర్స్‌గా, తృతీయ స్థానంలో ఎ.రంగంపేట సచివాలయం క్రీడాకారులు నిలిచారు. పురుషుల క్రికెట్ పోటీలలో ఇరంగారిపల్లె సచివాలయం విన్నర్స్‌గా, చిన్నగొట్టిగల్లు రన్నర్స్‌గా, తృతీయ స్థానంలో కాలేపల్లె సచివాలయం క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీల నిర్వహణలో పీడీ అసోసియేషన్ సెక్రటరీ బొందు సుబ్రమణ్యంరెడ్డి, పీడీలు మదన్‌మోహన్, పూర్ణ, ప్రభాకర్, జ్యోతి, భార్గవి, భాను, గణపతి, హాకీ కోచ్ మాలతి, పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్నకు వైభవంగా గరుడోత్సవం



చంద్రగిరి, జనవరి 25: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజి రంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారథి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ మృతి

పుత్తూరు అర్బన్, జనవరి 25: రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ మృతి చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు..పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ లక్ష్మీపతినాయుడు (68), తన భార్య లక్ష్మీకాంతమ్మతో కలిసి వేపగుంట క్రాస్ వద్ద ఉన్న ఆస్పత్రికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోకి వెళ్లడానికి వీలుగా రోడ్డు క్రాస్ చేసేందుకు ఎడమ వైపు వాహనాన్ని నిలిపారు. ఈ సమయంలో నగరి నుంచి పుత్తూరు వైపు వస్తున్న లగేజ్ వ్యాను వీరిని వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీపతినాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య లక్ష్మీకాంతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మీపతినాయుడు ప్రస్తుతం పరమేశ్వరమంగళం పంచాయతీ వార్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు.

## వెంకన్న పరమ భక్తురాలు వెంగమాంబ : భూమన్



తిరుపతి (కల్చరల్), జనవరి 25: తిరుమల శ్రీవారి భక్తులలో తరిగొండ వెంగమాంబకు ప్రత్యేక గుర్తింపు ఉందని శ్వేత పూర్వ సంచాలకులు భూమన్ అన్నారు. వినాయకనగర్ క్వార్టర్స్ మైదానంలో భారతీయ విద్యాభవన్ నిర్వహిస్తున్న 16వ తిరుపతి పుస్తక ప్రదర్శనలో గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీవారి సేవలో అన్నమయ్య లాలి, వెంగమాంబ హారతి అతి ప్రధానమైన నిత్య సేవలన్నారు. వెంగమాంబ రచించిన వేంకటేశ్వర మాహత్మ్యం చాలా గొప్ప కావ్యంగా పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వేదికపై ఎస్వీబీసీ ఛానల్ అధ్యక్షుడు డాక్టర్ వెలుగోటి సాయికృష్ణయాచేంద్ర గేయావధానం చేశారు. భారతీయ విద్యా భవన్ సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. ప్రచ్ఛకులుగా తోట వెంకటేశ్వర్లు, ఆచార్య సింగిరాజు దక్షిణామూర్తిశర్మ, ఎం.రాధాకృష్ణారెడ్డి, కె. బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల మధ్య కాలేజీ విద్యార్థులకు నాకు నచ్చిన పుస్తకం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం సంగీత విభావరి జరిగింది.

## పుస్తక ప్రదర్శనలో ఫాలున్‌దాఫా


ఫాలున్ దాఫా సాధనా విధానం - పుస్తక ప్రదర్శనలో ఫాలున్ దాఫా స్టాల్

తిరుపతి (కల్చరల్), జనవరి 25 : వినాయకనగర్ క్వార్టర్స్ మైదానంలో ఏర్పాటు చేసిన తిరుపతి పుస్తక ప్రదర్శనలో ఈసారి ఒక వినూత్నమైన దుకాణం ఉంది. ఫాలున్ దాఫా(ఫాలున్ గోంగ్) అనేది ఒక ధ్యాన పద్ధతి. మానవులలో సత్యము, దయ, సహన గుణాలను మరింత పెంచడానికి ఈ పద్ధతి ఉపకరిస్తుంది. 1992లో మాస్టర్ లీ హోంగ్‌జీ ఈ పద్ధతిపై రెండు పుస్తకాలను ప్రచురించడం ద్వారా చైనాలో ఇది వెలుగు చూసింది. ఇందులో ఐదు రకాలైన అభ్యాసాలుంటాయి. ప్రస్తుతం 114 దేశాలలో ఈ విధానాన్ని ప్రజలు అభ్యసిస్తున్నట్లు బుక్ స్టాల్ నిర్వాహకుడు పి.సుబ్రమణ్యం తెలిపారు. ఈ విధానం తెలిపే జువాన్ ఫాలూన్ అనే పుస్తకంతో పాటు ధ్యానం చేయడానికి తగిన విధంగా మంద్రస్థాయిలో కూర్చిన సంగీతం కూడా ఇస్తున్నట్లు చెప్పారు. పసి పిల్లల నుంచి 90 ఏళ్ల వయసు వ్యక్తుల వరకు ఈ విధానాన్ని అవలంబించవచ్చునని తెలిపారు. ఈ ధ్యాన విధానం నేర్చుకోవాలనుకునే వారు తొలిదశలో ఆన్‌లైన్ ద్వారా క్లాసులకు హాజరుకావచ్చునని అన్నారు. ఫాలున్ దఫా ధ్యాన పద్ధతుల గురించి తెలుసుకోవడానికి తిరుపతి పుస్తక ప్రదర్శనలోని 34వ నంబరు స్టాల్‌లో పుస్తకాలు విక్రయిస్తున్నట్లు చెప్పారు.

## దేశం కోసం మంచి నాయకులనే ఎన్నుకోండి

రామచంద్రాపురం, జనవరి 25: దేశ బంగారు భవిష్యత్తు కోసం మంచి నాయకులను ఎన్నుకోవాలని తహసీల్దారు చిన్న వెంకటేశ్వర్లు తెలియజేశారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దారు కార్యాలయం నుంచి ఆర్‌సీపురం వరకు గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు పూర్తయిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## అయిల్‌ఫాం సాగుకు శ్రీకారం

రామచంద్రాపురం, జనవరి 25: మండలంలో అయిల్‌ఫాం సాగుకు ఉద్యానవన శాఖ అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. మండలంలోని రావిళ్లవారిపల్లె గ్రామంలో తొలుత చిట్టిబాబు అనే రైతు మూడు ఎకరాల్లో 150 అయిల్‌ఫాం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వం హెక్టారుకు రూ.29వేలు రాయితీ ఇస్తుందన్నారు. నాలుగేళ్ల పాటు ఎరువులు, మందులకు రూ.10వేలు వంతున అందజేస్తుందని వివరించారు. మూడేళ్ల తర్వాత దిగుబడి మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 3ఎఫ్ ఏజీఎం మురళి, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైంది

తిరుపతి, విశ్వవిద్యాలయం, జనవరి 25: ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైందని, ఉన్నతమైందని చంద్రగిరి ఎంఈవో లలితకుమారి అన్నారు. గురువారం తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, హోమ్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ప్రకాశం భవనంలోని ఎకనామెట్రిక్స్ సెమినార్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రగిరి ఎంఈవో లలితకుమారి మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థినీ గమనించాలని అందరూ బాగా చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోదాలక్ష్మి, హోమ్‌సైన్స్ విభాగం అధిపతి మంజుల, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ స్వరూపరాణి, ప్రొఫెసర్ ఆర్యే. అనురాధ, సుచరిత, నర్సరీ స్కూల్ ఉపాధ్యాయులు, కార్వేటినగరం డైట్ విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 400 సెల్‌ఫోన్ల రికవరీ

**● సెల్‌పోతే సీఈఐఆర్ పోర్టల్, మొబైల్‌హంట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచన**



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25 : ప్రజలు పోగొట్టుకున్న, చోరీకి గురైన 400 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్టు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.72 లక్షలు ఉంటుందని చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. సెల్‌ఫోన్ల చోరీకి సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై తిరుపతి సైబర్ సెల్ సీఐ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణుల బృందం అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందన్నారు. ఇదివరకు ఏడు విడతలుగా సుమారు రూ.4,01,40,000 విలువైన 2,230 సెల్‌ఫోన్లను రికవరీ చేసి సొంతదారులకు అందజేసినట్టు చెప్పారు. ఎనిమిదో విడతగా ఈ దఫా 400 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. అనంతరం కొందరు బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు.

**సెల్‌పోతే 9490617873కు హాయ్ చెప్పండి..**

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుల కోసం మొబైల్ హంట్ పేరిట వెబ్‌లింక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, అలాగే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లోనూ ఫిర్యాదు చేసే అవకాశముందని ఎస్పీ పేర్కొన్నారు. మొబైల్ హంట్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ చేయకుండానే రికవరీకి చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు పోలీస్ వాట్సప్ నంబర్ 9490617873కు హాయ్ అనిగాని, హెల్ప్ అనిగాని మెసేజ్ పెడితే తక్షణం ఓ వెబ్‌లింక్ వస్తుందని, అందులో పేర్కొన్న వివరాలను నింపి సెండ్ చేస్తే ఫిర్యాదు సైబర్‌సెల్ పోలీసులకు చేరిపోతుందని తెలిపారు. రికవరయినతర్వాత బాధితులకు అందజేస్తారన్నారు.

**ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి : ఎస్పీ**

రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని ఎస్పీ పరమేశ్వరరెడ్డి కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి ప్రలోభాలకూ లొంగకుండా వచ్చిన అభ్యర్థికి, పార్టీకి ఓటు వేయాలని సూచించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది, కార్యాలయ సిబ్బందితో కచ్చితంగా ఓటు వేస్తానని ప్రమాణం చేయించారు.

# భూ కబ్జాదారులపై ఉద్యమిద్దాం

**బాధితులకు అండగా ఉందాం - అఖిలపక్షం తీర్మానం**


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఊకా విజయ్‌కుమార్

తిరుపతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఐదేళ్లుగా భూ కబ్జాలు ఎక్కువైపోయాయని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరింతగా భూబకాసురులు పేట్రేగిపోతున్నారని అఖిలపక్ష నేతలు అభిప్రాయపడ్డారు. బాధితులకు అండగా నిలవాలని తీర్మానం చేశారు. తిరుపతిలో భూకబ్జాలను అరికట్టేందుకు అఖిలపక్ష నాయకులతో కమిటీ ఏర్పాటైంది. జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ నేతృత్వంలో గురువారం ఓ హోటల్లో అఖిలపక్ష సమావేశంలో వివిధ పార్టీల నేతలు పాల్గొని ప్రసంగించారు. టీడీపీ నుంచి పాల్గొన్న ఊకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ బాధితులు పోలీస్ స్టేషన్‌కో, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు చేస్తుంటే కూర్చుని సెటిల్ చేసుకోండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. పరిష్కారం చూపాల్సిన అధికారులు వైసీపీ నేతల తొత్తులుగా మారిపోయారని పేర్కొన్నారు. భూబాధితులకు అఖిలపక్షం అండగా ఉంటుందని చెప్పారు. కబ్జాదారులకు అండగా ఉండే అధికారులు జైలుకెళ్లే ప్రమాదం ఉందని గ్రహించాలన్నారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ తిరుపతిలో వంద అంకణాలు కొనుగోలు చేసుకున్న వారు అక్కడే కాపలా కాసే పరిస్థితి వస్తోందన్నారు. భూమన అభినయరెడ్డి కార్పొరేటర్లకు టార్గెట్ ఇచ్చినట్టుగా తెలుస్తోందని, ఎవరు ఎక్కువగా భూకబ్జాలు చేస్తే వారికి మార్కులు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా భూ కబ్జాలు ఆగడంలేదన్నారు. కబ్జాదారులను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి ఉపేక్షించరని, వారి పేర్లు చెప్పుకుని దందాలు చేసే వారిపై అఖిలపక్షం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు పొనగంటి భాస్కర్, మునిసుబ్రమణ్యం, టీడీపీ నేత చినబాబు, జనసేన నేతలు రాజారెడ్డి, సుభాషిణి, నాగరాజు రాయల్, ఆప్ నేత నీరుగట్టు నగేష్, బాధితులు సంపూర్ణమ్మ, దొమ్మరాజు లక్ష్మమ్మ, సుమతి, విజయలక్ష్మి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పరేడ్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ విద్యార్థినులు


కవాతు నిర్వహిస్తున్న పద్మావతి వర్సిటీ విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 25 : ఢిల్లీలో శుక్రవారం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పద్మావతి మహిళా యూనివర్సిటీకి చెందిన పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృందం ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొననుంది. ఈనెల ఒకటి నుంచి నిర్వహించిన యోగా, కవాతు, విద్యా, సాంస్కృతిక సంబంధ మెలకువలను శిక్షణ ద్వారా నేర్చుకున్నారు. వీరికి లీడర్‌గా కెస్వాతి వ్యవహరిస్తున్నారు. సయ్యద్ హీన, కేదశ్రీ, రంజని, అనిత, చందన, యామిని, కళ్యాణి, జోషిత, హర్షిణి పరేడ్‌లో పాల్గొననున్నారు. ఈ నెల 24వ తేదీన ప్రధాని మోదీ సమక్షంలో వీరు రిహార్సల్ పరేడ్, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చి అభినందనలు పొందారు. రాష్ట్రం తరఫున యూనివర్సిటీ విద్యార్థినులు ప్రాతినిధ్యం వహిస్తుండటం గర్వకారణమని పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి, రిజిస్ట్రార్ రజని పేర్కొన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.57 కోట్లు

తిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.57 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,991 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,959 మంది తలనీలాలు సమర్పించారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ డీజీపీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవిరావు, తెలంగాణ ఎమ్మెల్యే రాఘవరెడ్డి, సినీ నటుడు డానియల్ బాలాజీ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

## ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి


న్యాయవాదుల దీక్షకు మద్దతు పలుకుతున్న జనసేన నాయకులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 25 : ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి కోర్టు ఆవరణలో కొంతకాలంగా నిరసన తెలుపుతున్న న్యాయవాదులు, జనసేన పార్టీ లీగల్ సెల్ నాయకులు కంచి శ్యామల, శ్రీహరి, విజయభాస్కర్, శరత్‌బాబు, భార్గవ్, మోహన్‌రావు, ఎల్లమ్మనాయుడు, లక్ష్మీకుమార్, హేమకుమార్, నిరంజన్, దీపశ్రీ, శివ, హరీష్‌కుమార్, జయచంద్రలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్, పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి గురువారం మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ ఈ చట్టం అమలైతే ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## టీటీడీ చీఫ్ పీఆర్వోకు సన్మానం



తిరుపతి (కొర్లగుంట), జనవరి 25: టీటీడీ చీఫ్ పీఆర్వో గా పదోన్నతి పొంది న తలారి రవిని ఆయన కార్యాలయంలో చెల్లప్ప మేస్త్రీ అంబేడ్కర్ భవన్ కమిటీ గురువారం ఘనంగా సన్మానించింది. వారు మాట్లాడుతూ రవి అంచెలంచెలుగా ఎదిగి టీటీడీ చీఫ్ పీఆర్వోగా పదోన్నతి పొందడం యావత్ దళిత జాతి గర్వించదగ్గ విషయమని కొనియాడారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పరమశివం, కార్యదర్శి నాగేశ్వరరావు, సబ్ కమిటీ ప్రతినిధులు కె.రాధాకృష్ణ, సురేష్, చెన్నకేశవులు, రామమూర్తి, రాజేష్, శరణ్, ద్వారక, రఘురామ్, పద్మనాభం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ ప్రదానం


ఉమామహేశ్వరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 25: ఎస్వీయూ ఎకనమిక్స్ స్కాలర్ ఉమామహేశ్వరి డాక్టరేట్ పొందారు. ఎ స్టడీ ఆఫ్ మైక్రో ఫైనాన్షియల్ సర్వీసెస్ టు ద రూరల్ పూర్ థ్రో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ఇన్ చిత్తూరు డిస్టిక్ అంశంపై విశ్రాంతాచార్య శాంతకుమారి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

## ఇజ్రాయిల్‌లో ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టరింగ్, సిరామిక్ వర్క్, బిల్డింగ్ ఫ్రేమ్‌వర్క్, ఐరన్ బైండింగ్‌లో ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా స్కిల్ కమిటీ, పీడీ, డీఆర్‌డీ ఏడీ జ్యోతి గురువారం తెలిపారు. 8వ తరగతి అంతకంటే ఎక్కువ చదివి, ఇంగ్లిష్‌పై అవగాహన కలిగిన 21 నుంచి 45 లోపు వారు అర్హులని పేర్కొన్నారు. మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9988853335ను సంప్రదించాలన్నారు.

## ఎస్వీ జూనియర్‌లో ఘనంగా ఓటర్ల దినోత్సవం

తిరుపతి(విద్య) జనవరి 25 : టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ జూనియర్ కళాశాలలో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ సి.ప్రకాశ్‌బాబు లిటరసీ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ చెన్నారెడ్డి, పౌరశాస్త్ర అధ్యాపకులు మహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగంతో ఉపాధి, ఆర్థికాభివృద్ధి

**పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్ - తిరుపతిలో 2కె రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత**


ర్యాలీలో పాల్గొన్న ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ వీసీలు శ్రీకాంత్‌రెడ్డి, భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 24 : పర్యాటక రంగంతో యువతకు ఉపాధి అవకాశాలు దక్కడంతో పాటు దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్ పేర్కొన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా రమణ ప్రసాద్ మాట్లాడుతూ దేశ ఆర్థిక, సాంస్కృతిక రంగాలపై పర్యాటక రంగ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. పర్యాటకుల పట్ల సానుకూలంగా వ్యవహరించడం ద్వారా భిన్న సంస్కృతులను గౌరవించినట్లు అవుతుందని అన్నారు. పర్యాటకులకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి చెందితే యువతకు ఎక్కువగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. కళాశాల స్థాయిలో టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. మహతి ఆడిటోరియం నుంచి పద్మావతి మహిళా యూనివర్సిటీ దాకా చేపట్టిన 2కె రన్‌లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీని డీఆర్వో పెంచల్ కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. సభలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీలోకి చదలవాడ సుచరిత



తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 25: కృష్ణతేజ విద్యాసంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి సతీమణి చదలవాడ సుచరిత గురువారం బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుచరిత విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పురందేశ్వరిని కలిశారు. కండువా వేసి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు.

## ఘనంగా చండీహోమం

తిరుపతి (కల్చరల్), జనవరి 25 : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గురువారం ఉదయం చండీహోమం ఘనంగా నిర్వహించారు. పుష్యమి-గురుపుష్య యోగంలో నిర్వహించిన ఈ హోమంలో ఆర్జితం టికెట్లు కొన్న భక్తులు పాల్గొన్నారు. గంగమ్మగుడి ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కట్టా గోపి యాదవ్, సభ్యులు టి.వెంకటేశ్వరరావు, పి.ధనశేఖర్, ఎన్.భారతి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయండి



తిరుపతి (ఆటోనగర్) జనవరి 25 : తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజరు వినీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. గుంతకల్ డివిజన్ మేనేజరుగా మూడు రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్న ఆయన తనిఖీల్లో భాగంగా గురువారం తిరుపతి రైల్వేస్టేషన్ పరిధిలో రూ.300 కోట్లతో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సీఈ ఎంవీఎస్.రామరాజు, జోనల్ సీఈలు, డివిజన్ అధికారులు, స్థానిక అధికారులు ఉపేంద్రకుమార్, మాధవరావ్, ఎస్ఎంఆర్ చిన్నప్పరెడ్డి, ఏడీఈఎన్ శేషు పాల్గొన్నారు.

## దొంగ ఓట్లపై సీబీసీఐడీ విచారణ జరపాలి

**విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన టీడీపీ నేత కోడూరు**



తిరుపతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో దొంగ ఓట్ల నమోదుపై సీబీసీఐడీ విచారణ జరపాలని టీడీపీ నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం డిమాండు చేశారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా దొంగ ఓట్లకు వ్యతిరేకంగా విద్యార్థులతో కలసి నగరంలో ర్యాలీ నిర్వహించారు. దొంగఓట్ల సూత్రదారుల ఫొటోలు అద్దంలో కనిపిస్తున్నాయని ఎద్దేవా చేస్తూ ర్యాలీలో అద్దాలు పట్టుకుని నిరసన తెలిపారు. 'మన ఓటు-మన హక్కు' అంటూ నినదించారు. ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్ల సూత్రధారులు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాలని కోరారు. దొంగ ఓట్లు చేర్పించిన అధికారులపై చర్యలు తీసుకున్నట్టే నాయకులపైనా తీసుకోవాలని కోరారు. అధికార పార్టీ దొంగ ఓట్లతో గెలవాలని చూస్తోందని విమర్శించారు.

## కుంభమేళాలో సిద్ధమైన కొత్త రాజ్యాంగం

### పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 25 : ఇస్లామిక్ దేశాల తరహాలో మన దేశంలోనూ మత విలువల ఆధారంగా ప్రత్యామ్నాయ రాజ్యాంగం రాబోతోందని పౌర హక్కుల నేత ప్రొఫెసర్ జి. హరగోపాల్ పేర్కొన్నారు. రాజ్యాంగం - నైతికత అనే అంశంపై తిరుపతి పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో గురువారం సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ.. అలహాబాద్‌లో నిర్వహించిన కుంభమేళాలో మన దేశానికి కొత్త రాజ్యాంగం తయారు చేశారన్నారు. 2024 ఎన్నికల తరువాత దానికి మద్దతు లభిస్తే, కొత్త రాజ్యాంగం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. 1949లో నిర్వహించిన రాజ్యాంగ సభలోనే ఈ రాజ్యాంగం మనది కాదనీ, ఇది చీలికలు పేలికల రాజ్యాంగమనీ, పాశ్చాత్య విలువలు కలదని, మన సంస్కృతికి సంబంధించినది కాదనీ కొందరు విమర్శలు చేశారని గుర్తు చేశారు. ఆనాడు అలా విమర్శించిన భావజాలానికి సంబంధించిన వారే, ఇటీవల కుంభమేళాలో సర్వసంగ పరిత్యాగులైన సాధువులు తయారు చేసిన రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇస్లాంలో కానీ, క్రైస్తవంలో కానీ ఒకే దేవుడు, ఒకే తాత్విక చింతన కనుక, ఇస్లామిక్ దేశాల్లో మత విలువల ప్రాతిపదికన రాజ్యాంగం అమలవుతూ ఉందన్నారు. హిందూ మతంలో ఆరు తాత్విక చింతనలు ఉన్నాయన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో దేవుడున్నాడనీ, ఏ తాత్వికతను ఆధారం చేసుకొని మత రాజ్యాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమవుతుందని ప్రశ్నించారు. హిందూ మతం నుంచీ కొన్ని విలువలతో రాజ్యాంగాన్ని తయారు చేయాలని కొందరు ప్రయత్నం చేస్తే, ఆనాడే అంబేడ్కర్ వాటి మూలాల్లోకి వెళ్లి ప్రశ్నించారని తెలిపారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వారు, సమానత్వాన్ని అంగీకరించరని, సమానత్వం అంటే ఎదగడానికి ప్రతి మనిషికీ సమాన అవకాశాలు కల్పించడమేనన్నారు. మహిళల హక్కులను ఏ ఒక్క మతం అంగీకరించదనీ, ఈ రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు ముందుకు రావడంతో పరిమితమైన హక్కులున్నప్పటికీ ప్రస్తుత రాజ్యాంగాన్ని సమర్థించాల్సి వస్తోందన్నారు. ఈ రాజ్యాంగంలో పేర్కొన్నటువంటి సమాజం కంటే ఉన్నతమైన సమాజాన్ని నిర్మించుకోవలసిన సమయంలో, ఉన్న రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమానవీయంగా మారిన మానవ సంబంధాలను పునరుద్ధరించవలసిన అవసరం ఉందన్నారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో నేటి సమాజానికి అవసరమైన నైతికత ఉందన్నారు. మనకు సమానమైన న్యాయం జరిగేలా రాజ్యాంగ పీఠిక రాశారని చెప్పారు. భారతీయుడు ఎలా ఉండాలో చూపిన రాజ్యాంగంలో పౌరుడి హక్కులే కాకుండా బాధ్యతలను కూడా పేర్కొన్నట్లు తెలిపారు. మానవ విలువలు కాలానుగుణంగా మారుతుంటాయనీ, ప్రాంతంతో పాటు కాలం కూడా వాటిని నిర్దేశిస్తుందన్నారు.పౌర చైతన్య వేదిక గౌరవాధ్యక్షుడు రాఘవశర్మ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో అధ్యక్ష, కార్యదర్శులు వాకా ప్రసాద్, కుమార్‌రెడ్డి, కోశాధికారి హరీష్, సాకం నాగరాజ, భూమన్, తమటం రామ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితులను వేధించడమే జగన్ లక్ష్యం

### కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తడ, జనవరి 25: దళితులను వేధించడమే జగన్ లక్ష్యమని కేంద్ర కేంద్ర మంత్రి చింతా మోహన్ విమర్శించారు. గురువారం తడ పంచాయతీ సెల్వకుప్పం, నడిమికుప్పం గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీప్రభుత్వం పూర్తిగా దళిత వ్యతిరేక ప్రభుత్వమని చెప్పారు. కోడికత్తి డ్రామాలాడి ఓ దళిత యువకుడిని ఐదేళ్లుగా జైల్లో నిర్బంధించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోతుందని అందుకే ఇప్పటి నుంచే తాను దిగిపోతానంటూ పరోక్షంగా ఓటమిని జగన్ ఒప్పుకుంటున్నాడన్నారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

### గణతంత్ర దిన వేడుకలకు ఏర్పాట్లు

గూడూరు, జనవరి 25: సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం నిర్వహించనున్న గణతంత్ర దిన వేడుకలకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఏర్పాట్లను తహసీల్దారు లీలారాణి పరిశీలించారు. ఆర్డీవో ఆధ్వర్యంలో జరగనున్న వేడుకల్లో ప్రజలు, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

### పాఠశాల తనిఖీ

కోట, జనవరి 25 : పుచ్చలపల్లిలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో దారా మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరుపట్టీని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## టీడీపీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం

● శాసించే స్థాయికీ ఎదిగారు : నరసింహయాదవ్, పాశిం



బీసీ సదస్సులో ఐక్యతను చాటుతున్న టీడీపీ నేతలు

చిట్టమూరు, జనవరి 25: టీడీపీ హయాంలోనే బీసీలకు సముచితం స్థానం ఉండేదని.. రాజకీయాలు నేర్చుకుని, శాసించే స్థాయికి ఎదిగారని తిరుపతి పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ సదస్సును మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, బీసీసెల్ అధ్యక్షుడు చెంచురామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి బీసీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 56 కార్పొరేషన్లు అంటూ సీఎం జగన్.. బీసీలను ప్రలోభాలకు గురిచేసి ఒక్క కార్పొరేషన్‌కు కూడా ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఏ సమావేశంలోనైనా చంద్రబాబు పక్కన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల నేతలే కనిపిస్తారని చెప్పారు. అదే వైసీపీ ప్రభుత్వంలో మాత్రం ఈ వర్గాలకు స్థానం లేకుండా చేశారన్నారు. గూడూరుకు ఒకాయన చెన్నై నుంచి వచ్చి ఎమ్మెల్యే అయి ప్రజలను, సమస్యలను గాలికి వదిలేస్తే.. ఇపుడు రాపూరు నుంచి మరోకాయన అన్నీ సర్దుకు పోయేందుకు వస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని జగన్‌కు అర్థమైందని, అందుకే సంతోషంగా దిగిపోతానని తిరుపతిలో ఒప్పుకున్నారన్నారు. నాయకులు బిల్లు చెంచురామయ్య, రుద్రకోట సదాశివం, కస్తూరయ్య, తీగల సురేష్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, బాలకృష్ణయాదవ్, చేజర్ల మనోహర్, మునస్వామి, రషీద్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేసిన వైసీపీ: నెలవల



నెలవల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

సూళ్లూరుపేట, జనవరి 25: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలను మోసం చేసిందని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఆర్అండ్‌బీ బంగ్లాలో నెలవల సమక్షంలో దొరవారిసత్రం మండలం నెమలిమిట్ట అగ్రహారానికి చెందిన వైసీపీకి చెందిన సమాది సుబ్రమణ్యం యాదవ్, నెలవల శ్రీనివాసుల యాదవ్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వైసీపీకి చెందిన బీసీ నాయకులందరూ టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని నెలవల చెప్పారు. తమ అధినేత చంద్రబాబు ఆదేశాలతో అందరినీ కలుపుకుని నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయకులు బొమ్మన్ పళణి, మొలచాం సుదర్శన్ రావు, పూడి శెల్వం, ఏజీ కిషోర్, వెంకటేశ్వర్లు, సంచి కృష్ణయ్య, భాస్కర్, జయపాల్, టీకే రవి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : కురుగొండ్ల



సదస్సులో ప్రసంగిస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, జనవరి 25: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, బిడ్డల భవిష్యత్తు బాగుండాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం బాలాయపల్లిలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా నాయకుడు రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్లను సీఎం జగన్ నిర్వీర్యం చేశారని ఆగ్రహించారు. బీసీల నిధులనూ పక్కదారి పట్టించారని చెప్పారు. కురుగొండ్ల మాట్లాడుతూ.. బీసీలకు గుర్తింపు ఇచ్చింది టీడీపీయేనన్నారు. నాయకులు గంగోటి నాగేశ్వరరావు, రాయి మస్తాన్‌నాయుడు, మునుస్వామి, రాయి సత్యంనాయుడు, దాసరి రాజగోపాల్‌నాయుడు, కూను శ్రీహరి, దాసరి ప్రభాకర్‌నాయుడు, కొర్రపాటి రామచంద్రయ్యనాయుడు, వెంకటాద్రి, సీనీనాయుడు, మద్దూరు కృష్ణ, ప్రసన్నకుమార్, సీవీకేనాయుడు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అండర్ పాస్ కోసం జాతీయ రహదారి దిగ్బంధం

● రాజకీయ పార్టీలకతీతంగా పెసల గుర్రప్పతోట వద్ద నిరసన
● కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
● ఇబ్బంది పడ్డ ప్రయాణికులు



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ప్రజలు - బారులు తీరిన వాహనాలు

పెళ్లకూరు, జనవరి 25: అండర్ పాస్ కోసం పెళ్లకూరు మండలంలోని పెసల గుర్రప్పతోట వద్ద జాతీయ రహదారిని గురువారం స్థానికులు దిగ్బంధించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పెసల గుర్రప్పతోట వద్ద 20 గ్రామాలకు, సెజ్‌లకు వెళ్లే రహదారి సౌకర్యం కనుమరుగైంది. కొంతకాలంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులతోపాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరినా ఫలితం కానరాలేదు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు రాజకీయ పార్టీలకతీతంగా స్థానిక నేతలతో కలసి గురువారం ఉదయం తొమ్మిది గంటలకు మూకుమ్మడిగా పెసల గుర్రప్పతోట వద్ద జాతీయరహదారిని దిగ్బంధించారు. సుమారు గంటకుపైగా రాస్తారోకో చేపట్టడంతో ఇరువైపులా వాహన రాకపోకలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తదితరులు కూడా వీరికి మద్దతు తెలిపారు. కామిరెడ్డి మాట్లాడుతూ.. 20 గ్రామాలతోపాటు సమీపంలో ఉన్న సెజ్‌ల రాకపోకలకు అనుకూలంగా అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. ఇక్కడి ప్రజల బాధను చూసి అయినా అండర్ పాస్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పాలచ్చూరు సర్పంచు పెళ్లూరు షర్మిలారెడ్డి మాట్లాడుతూ.. తమగోడును ప్రభుత్వం పట్టించుకుని ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం అండర్ పాస్ ఏర్పాటు చేయాలని, లేకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెళ్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కాటంరెడ్డి రామలింగారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మద్దాల కీర్తిరెడ్డి, దువ్వూరు సతీష్‌రెడ్డి, గుండాల సురేష్‌రెడ్డి, పగడాల హరిబాబు, యాళ్ల సుధాకర్‌నాయుడు, వేములయ్య, రాజయ్య, టీడీపీ నాయకులు మాడపూరు మురళీనాయుడు, అక్కరపల్లి రవీంద్రరెడ్డి, చలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు,

## అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### కలెక్టర్ వెంకటరమణారెడ్డి



ఓటరు చైతన్య ర్యాలీలో కమిషనర్ హరిత తదితరులు (ఇన్‌సెట్లో) నూతన ఓటర్లకు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి (రవాణా), జనవరి 25: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. కచ్చపి కళాక్షేత్రంలో నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, ఆర్డీవోలు, ఈఆర్వోలతో కలిసి నిర్వహించిన 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1950వ సంవత్సరంలో ఎన్నికల సంఘం ఏర్పడిందని, 2011 నుంచి జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. 18 ఏళ్లు పైబడిన వారందరూ ఓటు హక్కు పొంది, వినియోగించుకోవాలన్నారు. కులం, మతం, డబ్బు చూడకుండా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు ద్వారా మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం డీఆర్వోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు, బీఎల్‌వోలకు ప్రశంసాపత్రాలు, 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదు అయిన యువతకు గుర్తింపు కార్డులను కలెక్టర్, కమిషనర్ పంపిణీ చేశారు. అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఆర్డీవో, తహసీల్దార్లతో కలిసి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ ఓటరుగా నమోదు చేసుకోకుంటే వెంటనే చేసుకోవాలన్నారు. ఇప్పటికే చేసుకుని ఉంటే జాబితాలో పేరుందో లేదో చూసుకోవాలని, లేనిపక్షంలో ఫారం 6 ద్వారా నమోదు చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ జీఎం వీఆర్ చంద్రమౌళి, ఆర్డీవోలు, ఈఆర్వోలు నిశాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, రవిశంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, అర్బన్ తహసీల్దారు వెంకటరమణ, ఏఈఆర్వోలరమేష్‌బాబు, ప్రమీల, సుబ్రహ్మణ్యం, మునిశైలజ, భూపతి, సుబ్రహ్మణ్యం, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 400 సెల్‌ఫోన్ల రికవరీ

### సెల్‌పోతే సీఈఐఆర్ పోర్టల్, మొబైల్‌హంట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచన



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25 : ప్రజలు పోగొట్టుకున్న, చోరీకి గురైన 400 సెల్‌ఫోన్లను రివకరీ చేసినట్టు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.72 లక్షలు ఉంటుందని చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. సెల్‌ఫోన్ల చోరీకి సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై తిరుపతి సైబర్ సెల్ సీఐ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణుల బృందం అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందన్నారు. ఇదివరకు ఏడు విడతలుగా సుమారు రూ.4,01,40,000 విలువైన 2,230 సెల్‌ఫోన్లను రికవరీ చేసి సొంతదారులకు అందజేసినట్టు చెప్పారు. ఎనిమిదో విడతగా ఈ దఫా 400 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. అనంతరం కొందరు బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు.

**సెల్‌పోతే 9490617873కు హాయ్ చెప్పండి..:** సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుల కోసం మొబైల్‌హంట్ పేరిట వెబ్‌లింక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, అలాగే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లోనూ ఫిర్యాదు చేసే అవకాశముందని ఎస్పీ పేర్కొన్నారు. మొబైల్ హంట్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ చేయకుండానే రికవరీకి చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు పోలీస్ వాట్సప్ నంబర్ 9490617873కు హాయ్ అనిగాని, హెల్ప్ అనిగాని మెసేజ్ పెడితే తక్షణం ఓ వెబ్‌లింక్ వస్తుందని, అందులో పేర్కొన్న వివరాలను నింపి సెండ్ చేస్తే ఫిర్యాదు సైబర్‌సెల్ పోలీసులకు చేరిపోతుందని తెలిపారు. రికవరీ అయిన తర్వాత బాధితులకు అందజేస్తారని చెప్పారు. తిరుపతి సైబర్ క్రైమ్ సీఐ ఓ.రామచంద్రారెడ్డిని, సైబర్ సెల్ సాంకేతిక నిపుణులను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా పరిపాలనా విభాగం అదనపు ఎస్పీ వెంకటరావు, శాంతి భద్రతల విభాగం అదనపు ఎస్పీ కులశేఖర్ పాల్గొన్నారు.

## రైలు కింద పడి యువకుడి మృతి

పుత్తూరు అర్బన్, జనవరి 25: రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపిన వివరాల మేరకు.. తిరుచానూరుకు చెందిన పాండు (29) అదే ఊరిలో చిన్నపాటి దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. గురువారం పూడి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ మృతి



లక్ష్మీపతినాయుడు (ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్, జనవరి 25: రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ మృతి చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ లక్ష్మీపతినాయుడు (68), తన భార్య లక్ష్మీకాంతమ్మతో కలిసి వేపగుంట క్రాస్ వద్ద ఉన్న ఆస్పత్రికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోకి వెళ్లడానికి వీలుగా రోడ్డు క్రాస్ చేసేందుకు ఎడమ వైపు వాహనాన్ని నిలిపారు. ఈ సమయంలో నగరి నుంచి పుత్తూరు వైపు వస్తున్న లగేజ్ వ్యాను వీరిని వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీపతినాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య లక్ష్మీకాంతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు.. బాధితురాలిని వైద్యం కోసం తిరుపతిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీపతినాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, లక్ష్మీపతినాయుడు ప్రస్తుతం పరమేశ్వరమంగళం పంచాయతీ వార్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు.

# పుత్తూరు వార్తలు

## సౌరకాయల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, జనవరి 25 : రోడ్డు విస్తరణలో తొలగించిన సౌరకాయల స్వామి ఆలయం పునర్నిర్మాణానికి గురువారం మంత్రి రోజా.. భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల కిందట జాతీయ రహదారి విస్తరణలో కార్వేటిన గరం కూడలిలో తొలగించిన ఈ ఆలయాన్ని భక్తుల కోరిక మేరకు తమ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, వైసీపీ నాయకులు మాహీన్, జయప్రకాష్, శంకర్, రమేష్ బాబు, మనోహర్‌రెడ్డి, వనితకార్తీక్, చిన్న, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంపూర్ణ ప్రజారోగ్యమే లక్ష్యం



శిలాఫలాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జనవరి 25: సంపూర్ణ ప్రజారోగ్యమే సీఎం జగనన్న లక్ష్యమని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా రూ.52 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అదనపు గదులను ఆయన ప్రారంభించారు. జడ్పీటీసీ సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## రంగుంట శ్మశాన స్థలం సర్వే



పుత్తూరు టౌన్, జనవరి 25: తడుకు పంచాయితీ పరిధిలోని రంగుంట యానాది కాలనీ శ్మశాన స్థలాన్ని గురువారం సర్వేయర్, వీఆర్వోలు సర్వే చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకులు నందయ్య మాట్లాడుతూ.. తడుకు లెక్కదాఖాలతో 272-2లో యానాదులు శ్మశానాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. దీనికి హద్దురాళ్లను ఏర్పాటు చేసి, జస్టిస్ పున్నయ్య జీవోను అమలు చేయాలని కోరారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు అర్బన్, జనవరి 25: పట్టణ పరిధిలోని శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి గురువారం పరిశీలించారు. విద్యుత్ దహన వాటిక నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. శ్మశాన వాటికకు అవసరమైన విద్యుత్‌ను యుద్ధప్రాతిపదికన సమకూర్చాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు.

## వైసీపీ పాలనతో విసిగిపోయిన జనం

గాలి భాను ప్రకాష్



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గాలి భాను ప్రకాష్

వడమాలపేట, జనవరి 25: అవినీతి, అక్రమాల వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ చెప్పారు. వడమాలపేటలో గురువారం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించి, ప్రసంగించారు. ప్రస్తుతం ప్రజలంతా టీడీపీవైపు మొగ్గు చూపుతున్నారని, వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని స్పష్టం చేశారు. అందరినీ కలుపుకుని సామరస్యంగా టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరునూ క్షేత్రస్థాయిలో కలిసి వైసీపీ ప్రభుత్వం చేసే దురాగతాలను తెలియజేయాలని సూచించారు. ప్రధానంగా.. నియోజకవర్గంలో మంత్రి, ఆమె అనుచరుల దౌర్జన్యాలు, అకృత్యాలను గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మణిరాజు, నాయకులు భాస్కర్ నాయుడు, జానా వెంకటయ్య, మునిశేఖర్, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఉమాపతి రావు, పెద్దబ్బ రాజు, లక్ష్మీప్రసన్న, హేమావతి, ధనలక్ష్మి, వెంకటేశ్వరరావు, హేమాద్రినాయుడు, దాముయాదవ్, దేవ, వివేకానంద, రఘు, సుకుమార్, వెంకటేష్ యాదవ్, చక్రి, ఉదయ్ యాదవ్, పురుషోత్తం నాయుడు, ఆదెయ్య, రవిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి పదవికి

## రోజా రాజీనామా చేయాలి

### టీడీపీ కౌన్సిలర్లు

పుత్తూరు అర్బన్, జనవరి 25: 'ఏ మాత్రం నైతిక విలువలున్నా, భారత రాజ్యాంగం, చట్టసభలపై గౌరవం ఉన్నా వెంటనే మంత్రి రోజా తన పదవికి రాజీనామా చేయాలి. వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధం కావాలి' అని టీడీపీ కౌన్సిలర్లు రాధా అశోక్, డాక్టర్ సింగరాజు బసంతి డిమాండ్ చేశారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ మహిళకు అన్యాయం జరిగినా గన్ కన్నా ముందు జగన్ వస్తాడని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఊరూవాడా ఊదరగొట్టిన రోజా.. ఇప్పుడు సొంత నియోజకవర్గంలో సొంత పార్టీ మహిళా కౌన్సిలర్‌ను మోసం చేస్తే జగన్ రాలేదేమని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో అమ్ముకోవడానికే పదవులు అన్నట్లు నియోజకవర్గంలో వైసీపీ పాలన సాగిందని దుమ్మెత్తిపోశారు. వీడియో ఆధారాలతో సహా దొరికిపోయిన రోజాకు ఒక్క క్షణం కూడా మంత్రి పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని తేల్చి చెప్పారు. నగరి నియోజకవర్గం పరువు రాష్ట్ర వ్యాప్తంగా మంటగలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సహచర మహిళా కౌన్సిలర్ భువనేశ్వరికి వైసీపీ పెద్దలు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు నాగరత్నమ్మ, మోహన, రజని తదితరులు పాల్గొన్నారు.

## నడకతో సగం రోగాలు దూరం



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న డీఎం ప్రశాంతి

పుత్తూరు అర్బన్, జనవరి 25: రోజూ నడవడం ద్వారా సగం రోగాలు దూరమవుతాయని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి రవిరాజు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రశాంతి మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం తిరుపతి ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ ఐ కేర్, కృష్ణతేజ డెంటల్ హాస్పటల్, విజయ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సుమారు 350 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవిరాజు, అసోసియేషన్ అధ్యక్షుడు బాబు, కార్యదర్శి రామ్మోహన్‌వర్మ, ట్రెజరర్ లోకనాధనాయుడు, ఎలక్ట్ గవర్నర్ రావిళ్ల మాధవనాయుడు, హేమసుందరవర్మ, ఏపీఎస్ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటుదే కీలకపాత్ర



హిమజ డిగ్రీ కళాశాలలో ఓటుపై విద్యార్థులకు అవగాహన - సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి - ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

పుత్తూరు అర్బన్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటుదే కీలకపాత్రని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గాంధీ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటు హక్కుపై పట్టణంలోని హిమజ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని చెప్పారు. కాపు వీధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సీనియర్ ఓటర్లను మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి సత్కరించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు.

**వడమాలపేట:** ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం వడమాలపేటలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

శ్రీకాళహస్తి, జనవరి 25: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇంచార్జి వినుత డిమాండ్ చేశారు. తిరుపతి న్యాయస్థానం వద్ద న్యాయవాదుల రిలే దీక్షకు శ్రీకాళహస్తి జనసేన నాయకులు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇలాంటి ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు దండి రాఘవయ్య, రవికుమార్, బాలాజీ, జ్యోతి, చిరంజీవి పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన సీఐలు


సీఐ నరసింహారావు

శ్రీకాళహస్తి, జనవరి 25: శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐగా నరసింహారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మూడు రోజుల క్రితం ఇక్కడ నుంచి సీఐ అంజూ యాదవ్ తిరుపతికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో అనంతపురం వీఆర్ నుంచి సీఐ నరసింహారావును బదిలీ చేశారు.

**ఏర్పేడులో శ్రీరామ శ్రీనివాసులు**


శ్రీరామ శ్రీనివాసులు

ఏర్పేడు, జనవరి 25: ఏర్పేడు సీఐగా శ్రీరామ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న శ్రీహరి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం నుంచి శ్రీరామ శ్రీనివాసులు ఏర్పేడుకు బదిలీపై వచ్చారు.

**బీఎన్‌కండ్రిగలో శ్రీహరి**


శ్రీహరి

తొట్టంబేడు, జనవరి 25: బీఎన్‌కండ్రిగ సీఐగా శ్రీహరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏర్పేడు నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ విదులు నిర్వహిస్తున్న సీఐ విక్రమ్‌ను అనంతపురం బదిలీ చేశారు.

## గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఏర్పేడు, జనవరి 25: మండలంలోని మాధవమాల గ్రామంలో గురువారం గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ ఘనంగా జరిగింది. మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, నీలకంఠారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవినాయుడు, సురేష్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు అమూల్యం


యువ ఓటర్లకు టీడీపీ సత్కారం

శ్రీకాళహస్తి, జనవరి 25: ఓటు హక్కు ఎంతో అమూల్యమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని టీడీపీ నాయకులు కొత్త ఓటర్లుగా నమోదైన వారిని గురువారం ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు దశరథాచారి, బుజ్జి, భాస్కర్ పాల్గొన్నారు.

## కమిషనర్‌కు ఎలక్ట్రోరల్ అవార్డు




శ్రీకాళహస్తి, జనవరి 25: శ్రీకాళహస్తి పురపాలక సంఘ కమిషనర్ రమేష్ బాబు ఉత్తమ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందుకున్నారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఎన్నికల సాధన అవార్డులను ప్రకటించారు. తిరుపతిలో జరిగిన సమావేశంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా గురువారం రమేష్ బాబు అవార్డు అందుకున్నారు.

## ఓటరు కార్డుల పంపిణీ


ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసిల్దారు సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, జనవరి 25: కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి తహసీల్దారు సుధీర్‌రెడ్డి కార్డులను పంపిణీ చేశారు. బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేయించారు.కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం




సత్యవేడు, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమని తహసీల్దార్ షేక్ జరీనాబేగం పేర్కొన్నారు. గురువారం ఆమె ఆధ్వర్యంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఓటు వేయడం మన బాధ్యతని ఆమె గుర్తు చేశారు.అనంతరం పలువురు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. అంతకు ముందు ఓటు ప్రాధాన్యతపై నినాదాలు చేస్తూ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు.ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవోలు రవి,ఉష, డీటీ రవిచంద్రబాబు, ఆర్ఐ కిరణ్‌కుమార్, దాసు డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పరంధాం, బీజేపీ నాయకుడు మోహన్‌బాబు పాల్గొన్నారు.

## సీనియర్ ఓటర్లకు సన్మానం



ఏర్పేడు, జనవరి 25: ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని 235, 236 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ లలితా కరుణాకర్, మాజీ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఓటు మనందరి హక్కు



పిచ్చాటూరు, జనవరి 25: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు విద్యార్థులతో పిచ్చాటూరు తహసీల్దార్ మధుసూదనరావు ఆధ్వర్యంలో బైపాస్ కూడలి వద్ద ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. సీనియర్ సిటిజన్లను సత్కరించారు. డీటీ వెంకటేశులు, ఎంఈవో యుగంధర్‌రాజు, ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

## టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉమేష్ రావు



శ్రీకాళహస్తి, జనవరి 25:టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఉమేష్ రావు ఎంపికయ్యారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఉమేష్ రావు కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేసింది. గతంలో ఆయన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమేష్ రావు మాట్లాడుతూ...క్రమశిక్షణ కలిగిన టీడీపీ సైనికుడిగా చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు.

## సిపాయి భరోసా అందజేత



ఏర్పేడు, జనవరి 25: ఏర్పేడు మండలం పాతవీరాపురంవాసి కొంగర మునిరెడ్డి ఇటీవల మృతి చెందాడు. గురువారం సిపాయి ట్రస్టు ద్వారా 40 రకాల నిత్యావసర సరుకులను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఆయన కుటుంబానికి అందజేశారు.

# శ్రీకాళహస్తి
# సత్యవేడు

## 15 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నాగలాపురం, జనవరి 25: నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లె పోలీస్ తనిఖీ కేంద్రం వద్ద ఓ ప్రైవేట్ ఆటోలో బుధవారం రాత్రి తమిళనాడు నుంచి ఆంధ్రకు రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టు కున్నారు. పట్టుబడిన ఆటోను నాగలాపురం స్టేషన్‌కు తరలించారు.బియ్యాన్ని స్థానికంగా ఉన్న ఓ రేషన్ షాపునకు తరలించినట్లు సమాచారం. దీనిపై ఎస్ఐ ఓబయ్య తహసీల్దార్‌కు నివేదిక అందించినట్లు తెలిసింది. తహసీల్దార్‌ను వివరణ కోరగా తమకు నివేదిక అందిన విషయం నిజమే కాని అందులో పట్టుబడిన వాళ్ల పేర్లను నమోదు చేయలేదన్నారు. పోలీసులు మాత్రం ఎటువంటి వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## నూనె కూజాల వితరణ

శ్రీకాళహస్తి, జనవరి 25: శ్రీకాళహస్తీశ్వరాలయానికి పట్టణానికి చెందిన రమేష్ రెడ్డి అనే భక్తుడు దివిటీల కోసం ఉపయోగించే నూనె కూజాలను వితరణ చేశారు. గురువారం ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేశారు.



తలిశెట్టి మోహన్ - రామాయణ కలంకారీ చిత్రం



అయోధ్య కళా సంస్కృతి పురస్కారం

## తలిశెట్టి మోహన్‌కు అయోధ్య పురస్కారం

శ్రీకాళహస్తి, జనవరి 25: శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన కలంకారి కళాకారుడు తలిశెట్టి మోహన్ అయోధ్య రామ మందిరం నుంచి కళా సంస్కృతి పురస్కారం అందుకున్నారు.అయోధ్యలో రామ మందిర కుంభాభిషేకాన్ని పురస్కరించుకుని కళా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. కలంకారి విభాగంలో రామాయణాన్ని చిత్రీకరించడంపై తలిశెట్టి మోహన్‌కు ప్రశంసా పత్రాన్ని పోస్టు ద్వారా గురువారం ఇంటికి పంపారు. దీనిపై కళాకారుడు మోహన్ సంతోషం వ్యక్తం చేశారు.

## వైసీపీ ఓడిపోతుందని జగనే అంగీకరించారు

మాజీ ఎంపీ చింతామోహన్


కాంగ్రెస్ శ్రేణులతో చింతామోహన్

సత్యవేడు, జనవరి 25:రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమని సీఎం జగన్ కూడా అంగీకరించారని మాజీ ఎంపీ చింతామోహన్ పేర్కొన్నారు. సత్యవేడు మండలం మదనంబేడు దళితవాడలో గురువారం చింతామోహన్ ఆధ్వర్యంలో మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా కరపత్రాలు పంచి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని అభ్యర్థించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఓడించి తమ కాళ్లను తామే నరుకున్నామన్న భావనలో దళితులున్నారని తెలిపారు. కోడి కత్తి శీను నుంచి డాక్టర్ సుధాకర్ వరకు దళితులను మానసికంగా హింసించి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు.ఆదానికి అప్పనంగా పోర్టు అప్పగించి రూ.600 కోట్లు దోచుకున్నారని సొంత చెల్లెలు షర్మిలమ్మ చెబుతున్నా జగన్ సమాధానం ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు.పార్టీ నాయకులు పురుషోత్తం, రాజేంద్రనాయుడు, బాలాజీనాయుడు, బాలాజీ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీ పాలనలో నాశనమైన రాష్ట్రం**

పిచ్చాటూరు, జనవరి 25: వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రం సర్వనాశనం అయిపోయిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. గురువారం పిచ్చాటూరు మండలం కీళపూడిలో ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని, రాష్ట్రంలో అధికారం కూడా చేపట్టబోతున్నామని ధీమా వ్యక్తపరచారు. కార్యక్రమంలో రాజేంద్రనాయుడు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌ను గెలిపించండి**

నాగలాపురం, జనవరి 25: మన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మాజీ ఎంపీ చింతామోహన్ పిలుపునిచ్చారు. గురువారం నాగలాపురంలోని పడమటి దళిత వాడలో చింతామోహన్ ఆధ్వర్యంలో ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న రెండు నెలల కాలంలో ప్రజలే జగన్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సింధూజ, జిల్లా అధ్యక్షురాలు తేజ, డాక్టర్ దామోదరం, ప్రేమ, జ్ఞానకన్ను, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

వరదయ్యపాళెం, జనవరి 25: వరదయ్యపాళెం మండలం తొండంబట్టు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జగదీష్ నాయుడు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి హెలెన్ అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట భాస్కర నాయుడు, కుమార్, మాజీ సర్పంచ్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేతలతో ఎంపీ సమావేశం

వరదయ్యపాళెం, జనవరి 25: వరదయ్యపాళెంలో వైసీపీ నేతలతో తిరుపతి ఎంపీ గురుమూర్తి సమావేశమయ్యారు. మండల వైసీపీ కన్వీనర్ దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సత్యవేడు నుంచి పోటీ చేయబోతున్న తనకు సహకారం అందించాలన్నారు.బొప్పల తిలక్‌బాబు, దామోదర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు

శ్రీసిటీ, జనవరి 25: రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన భార్య టీటీడీ స్థానిక సలహా కమిటీ(ఉత్తర భారతదేశం) ఛైర్‌పర్సన్ ప్రశాంతిరెడ్డి గురువారం శ్రీసిటీని సందర్శించారు. హంటర్ డగ్లస్ పరిశ్రమను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. వారికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు.

## రైతు ర్యాలీని విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి, జనవరి 25:శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం తలపెట్టిన రైతు ర్యాలీని విజయవంతం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి శివకుమార్ గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పీఆర్ అతిథి గృహం నుంచి ఉదయం 10గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలిపారు. రైతు వ్యతిరేక చట్టాలను ఖండిస్తూ గణతంత్ర దినోత్సవ రోజున అన్నదాతలు నినదించాలని పేర్కొన్నారు. పెద్దఎత్తున రైతులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

## ఉద్యానవన పంటలతో అధిక ఆదాయం

తొట్టంబేడు, జనవరి 25: ఉద్యాన పంటలతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం చిట్టత్తూరులో పామాయిల్ తోటల పెంపకంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పంట వేయడం వల్ల వచ్చే ప్రభుత్వం నుంచి హెక్టారుకు 39వేల రూపాయల రాయితీ పొందవచ్చని తెలిపారు. పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు మండల ఉద్యానశాఖాధికారి పుష్పలతను 7995086968 నెంబరులో సంప్రదించాలన్నారు.

## ఓటు హక్కు మన ఆయుధం

ఏర్పేడు, జనవరి 25: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అనేది గొప్ప ఆయుధమని పాపానాయుడు పేట జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ అమరేశ్వర్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటర్ విద్యార్థుల చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు ఉమ, వెంకటసురేష్, శంకరప్ప, సోమశేఖర్‌బాబు, నారాయణ, వైవీ రాధ పాల్గొన్నారు.

## తవ్వేకొద్దీ బయటపడుతున్న దొంగ ఓట్లు


తిమ్మసముద్రంలో బయటపడ్డ దొంగ ఓట్లు

కేవీబీపురం, జనవరి 25:కేవీబీపురం మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో తవ్వేకొద్దీ దొంగ ఓట్లు బయటపడుతున్నాయని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 40యేళ్ళుగా గ్రామం విడిచి చెన్నైలో స్థిరనివాసం ఉన్న వారి ఓట్లు కూడా తుది జాబితాలో తొలగించకపోవడంపై అడిగితే అధికారులు సమాధానం దాటవేస్తున్నారంటున్నారు.90కి పైగా దొంగ ఓట్లున్నట్లు గుర్తించిన సర్పంచ్ దొరబాబు నాయుడు తదితరులు వాటిని తొలగించి న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.

## పవిత్ర మృతదేహం బంధువులకు అప్పగింత


పవిత్ర (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జనవరి 25: ముక్కంటి ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పవిత్ర మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. బుధవారం రాత్రి స్వర్ణముఖి నదిలో వరదయ్యపాలెం ప్రాంతానికి చెందిన పవిత్ర మృతి చెందిన విషయం తెలిసింది. ఈ క్రమంలో మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి గురువారం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించారు. వారు వరదయ్యపాలెం తీసుకెళ్లి అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

## గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి జనవరి 25: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.శాస్త్రోక్తంగా కలశస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణకవచాలంకృతంగా అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడి సెనగల దండలను భక్తులు సమర్పించారు. వేదమంత్రాలు మధ్య ధూప దీప నైవేద్యాలను సమర్పించారు.

## క్రికెట్ విజేత కేవీబీపురం



కేవీబీపురం, జనవరి 25 : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో గురువారం సత్యవేడులో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లో నారాయణవనం మండలంపై కేవీబీపురం జట్టు విజయం సాధించింది.

## ఓటు ప్రతి పౌరుడి హక్కు


సీనియర్ ఓటరుకు సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 25: ఓటు ప్రతి పౌరుడి హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలని డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురష్కరించుకుని బుచ్చి నాయుడుకండ్రిగలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో కలసి గురువారం ర్యాలీ నిర్వహించారు.

## ఘనంగా ఓటరు దినోత్సవం

కేవీబీపురం, జనవరి 25: ఓటరు దినోత్సవ సందర్భంగా తహసీల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని శ్రీదేవి సూచించారు. డీటీ మునిరత్నం రెడ్డి, ఆర్ఐ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



శ్రీకాళహస్తి, జనవరి 25: టీడీపీలోకి పలువురు వైసీపీ మైనారిటీ నాయకులు చేరారు. పట్టణంలోని 16వ వార్డుకు చెందిన తహలీల్ ఆధ్వర్యంలో టీడీపీ గూటికి చేరారు.టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి సుధీర్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.టీడీపీ నాయకుడు రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఓటు ఆయుధంతోనే అవినీతి అంతం**

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధంతోనే అవినీతిని అంతం చేయగలమని సుధీర్ రెడ్డి అన్నారు.గురువారం ఓటు హక్కుపై యువతతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ...అమూల్యమైన ఓటుతో నిస్వార్థపరులైన నేతలను ఎన్నుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు.యువత అభ్యున్నతి కోసం తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకుంటానని చెప్పారు.

## జనసేన కార్యకర్త కుటుంబానికి భరోసా

శ్రీకాళహస్తి, జనవరి 25: ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన జనసేన కార్యకర్త వెంకటరమణ కుటుంబానికి పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టేసాయి భరోసా ఇచ్చారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలు గ్రామానికి చెందిన వెంకటరమణ ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆ కుటుంబ సభ్యులను కొట్టేసాయి గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. జనసేన నాయకులు జానీ, చిరంజీవి ఢిల్లీ బాబు, నారాయణ, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



